సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 3 । జూలై । 2023



రైతు దంపతుల దుర్మరణం
రైతు దంపతులు దుర్మరణం పాలయ్యారు. బెళుగుప్ప మండలం నక్కలపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. 8లో



వినూత్న పంట.. లాభాలేనంట
డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుతో గోరంట్ల మండలంలోని మల్లాపల్లికి చెందిన రైతు బాలకృష్ణ లాభాలు గడిస్తున్నాడు. 8లో

గరిష్టం/కనిష్టం
37.3°/22.6°
జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

94 శాతం పింఛన్ల పంపిణీ



దిగువచెర్లోపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఆదివారం నాటికి 94 శాతం 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ పూర్తయింది. 32 మండలాల పరిధిలోని 2,62,022 మంది లబ్ధిదారులకు రూ.72,76,04,500 నగదు మంజూరైంది. వలంటీర్ల సహకారంతో రెండు రోజుల్లో 2,45,389 మందికి రూ.68,12,68,250 అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో మూడు రోజులు డబ్బు పంపిణీ ఉంటుందన్నారు. పింఛన్ అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

సంతల ఆదాయం రూ.3.03 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం జీవాల సంతల ద్వారా రూ.3.03 లక్షల పైచిలుకు ఆదాయం ఫీజు రూపంలో వసూలైంది. ఈ మేరకు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్ ఆదివారం తెలిపారు.

ఏపీ ఈసెట్‌లో 'అనంత' విద్యార్థుల ప్రతిభ



బి. నెహారి చౌదరి

అనంతపురం: ఏపీ ఈసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)-2023లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతపురం జిల్లాలో మొత్తం 2,108 మంది విద్యార్థులు ఏపీ ఈసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,020 మంది పరీక్ష రాయగా.. 1,866 మంది అర్హత సాధించారు. వీరిలో అబ్బాయిలు 1,369 (91.82 శాతం) మంది, అమ్మాయిలు 497 (93.95 శాతం) మంది ఉన్నారు.

- శ్రీ సత్యసాయి జిల్లాలో 128 మంది ఏపీ ఈసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 125 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 112 (89.60 శాతం) మంది అర్హత సాధించారు. అమ్మాయిలు 80 మంది దరఖాస్తు చేసుకోగా.. 76 మంది పరీక్షకు హాజరయ్యారు. 73 (96.05 శాతం) మంది అర్హత సాధించారు.

సివిల్ సర్వీసెస్ ధ్యేయం
ఏపీ ఈసెట్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బి.నెహారిచౌదరి మొత్తం 200కు గాను 111 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు దక్కించుకున్నారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ విభాగంలో డిప్లొమా పూర్తి చేశారు. అమ్మా,నాన్న కవిత, బి.ప్రసాద్ స్ఫూర్తితో ఇంజినీర్ కావాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు నెహారి చౌదరి పేర్కొన్నారు. నాన్న ప్రస్తుతం వ్యాపారం చేస్తున్నారని, అమ్మ హంద్రీ-నీవా ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ సాధించాలనే ఆశయంతో ఉన్నానన్నారు.

నేడు గవర్నర్ రాక

ప్రశాంతి నిలయం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం పుట్టపర్తికి రానున్నట్లు ఆర్‌డీఓ భాగ్యరేఖ తెలిపారు. రాత్రి 8.05 గంటలకు గవర్నర్ పుట్టపర్తి చేరుకుంటారు. రాత్రి ప్రశాంతి నిలయం శాంతిభవన్‌లో బస చేస్తారు. మంగళవారం ఉదయం 9.45కు సాయికుల్వంత్ సభా మందిరం చేరుకుని సత్యసాయి మహాసమాధి దర్శించుకుంటారు. అనంతరం నూతనంగా నిర్మించిన సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం తిరిగి రోడ్డు మార్గాన బెంగళూరు బయలుదేరి వెళ్తారు.

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న అనంతపురం కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులకు సూచించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఆదివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు. బహిరంగ సభ వేదిక వద్ద గ్యాలరీ, సీటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు సరిగ్గా ఉండాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, సబ్‌కలెక్టర్ నిశాంత్‌రెడ్డి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నా పేరు నాగేంద్రమ్మ, మాది మైల సముద్రం గ్రామం. నాకు ఇద్దరు కుమార్తెలు సంతానం. కొన్నేళ్లుగా మగ్గంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నా. గతంలో వార్పు, నూలు ఇతర సామగ్రి కొనుగోలుకు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వచ్చేది. చీర పూర్తి కాగానే వచ్చిన దాంట్లో వడ్డీలు కట్టుకొని మిగిలిన సొమ్ముతో పిల్లల చదువులు, కుటుంబ పోషణ చూసుకునేవాళ్లం. మా కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... అధికారం చేపట్టిన 4 నెలలకే 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం ప్రవేశపెట్టి ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల సొమ్ము మా ఖాతాలో జమ చేశారు. ఐదో విడత జాబితాలోనూ నాపేరుంది. ప్రభుత్వ ఆర్థిక సాయం అందడం వల్ల అప్పు చేయాల్సిన బాధ తప్పింది. మా రెక్కల కష్టం ఫలితం మాకే దక్కుతోంది.



నా పేరు సాయిలీల, పుట్టపర్తిలోని తారకరామనగర్‌లో ఉంటున్నాం. నాకు ఇద్దరు కుమారులు సంతానం. నేను, నాభర్త మగ్గం నేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పిల్లలిద్దరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఎవరి సిఫారసు లేకుండా సంక్షేమ పథకాలన్నీ మాకు అందుతున్నాయి. అలాగే ' వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం కింద ఏటా రూ.24 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి. అధికారులు ముద్ర రుణాలు ఇచ్చారు. జాతీయ అభివృద్ధి చేనేత మండలి ద్వారా 90 శాతం సబ్సిడీతో మగ్గం పనిముట్లు అందజేశారు. దీంతో మా కుటుంబం ఏ ఇబ్బంది లేకుండా బతుకుతోంది. మాలాంటి ఎందరో చేనేతల జీవితాలకు సీఎం జగన్ అండగా నిలిచి చేయూతనిస్తున్నారు.

చేనేత..చేయూత

- నేతన్నకు అండగా జగన్ సర్కార్
- 'వైఎస్సార్ నేతన్న నేస్తం'తో ఆర్థిక సాయం
- ఏటా రూ.24 వేలు అందిస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే నాలుగు విడతల సాయం అందజేత
- ఈనెలలోనే ఐదో విడత సొమ్ము విడుదలకు చర్యలు
- జిల్లాలో 15,530 మంది నేతన్నలకు లబ్ధి

జిల్లాలో నేతన్న నేస్తం లబ్ధిదారులు ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య
2019-20	16,813
2020-21	14,640
2021-22	14,224
2022-23	14,973
2023- 24	15,530



మగ్గం పనిముట్లు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

పుట్టపర్తి టౌన్: జనరంజక పాలనతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి... నేతన్నలకూ అండగా నిలిచారు. చేనేతకు పూర్వ వైభవం కల్పించేందుకు పలు పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ముఖ్యంగా నేతన్నలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు 'వైఎస్సార్ నేతన్న నేస్తం'తో ఆర్థిక తోడ్పాటు ఇస్తున్నారు. అలాగే ముద్ర రుణాలు, జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, జాతీయ చేనేత బ్రాండ్ పథకం ద్వారా నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం తదితర కార్యక్రమాలతో నేతన్నల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చారు. దీంతో మూల పడిన మగ్గాలు మళ్లీ చప్పుడు చేస్తున్నాయి.

'నేస్తం'తో జీవితాల్లో వెలుగులు..
టీడీపీ హయాంలో చేనేత రంగం నిర్వీర్యమైంది. పాలకులు పట్టించుకోక వృత్తినే నమ్ముకున్న నేతన్నలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెట్టుబడులు కూడా దక్కక అప్పులపాలై ఆత్మహత్యలకు తెగించారు. ప్రతిపక్షనేతగా చేనేతల జీవితాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నేతన్నల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే 2019 డిసెంబర్ 21వ తేదీన జిల్లాలోని ధర్మవరం నుంచే 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకాన్ని ప్రారంభించి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా రూ.24 వేల చొప్పున అందిస్తూ మగ్గాలకు మంచి రోజులు తెచ్చారు.

ఐదో విడత అర్హుల జాబితా సిద్ధం..
'నేతన్న నేస్తం' కింద ఇప్పటికే నాలుగు విడతల సాయం నేరుగా నేతన్నల ఖాతాల్లో జమ చేసిన జగన్ సర్కార్...ఐదో విడత అమలుకు సిద్ధమైంది. ఈ నెలలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు. ఇందుకోసం అధికారులు అర్హుల జాబితా సిద్ధం చేశారు. గతంతో పోలిస్తే ఈసారి లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. ఐదో విడతలో జిల్లాలోని 15,530 మందికి నేతన్న 'నేస్తం' సాయం అందనుంది.

అర్హులందరికీ అందజేస్తాం



'నేతన్న నేస్తం' ద్వారా ప్రభుత్వం మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ. 24 వేలు అందిస్తోంది. ఇప్పటికే నాలుగు విడతల సాయం అర్హులకు అందింది. ఐదో విడతలో జిల్లాలోని 15,530 మంది అర్హత సాధించారు. ఈ నెలలోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. అలాగే 50 ఏళ్లు నిండిన నేతన్నలకు చేనేత పింఛన్లు అందిస్తున్నాం.

– రమేష్, ఏడీ, చేనేత, జౌళి శాఖ

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నేతన్న నేస్తం'తో ఎందరో చేనేతలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఇతర పథకాలూ వర్తింపజేస్తున్నారు. దీంతో చేనేత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. ఇప్పుడు నేతన్నలు ఎవరి వద్దా చేయి చాచాల్సిన అవసరం లేదు. నేతన్నలకు చేయూతనిస్తున్న సీఎంకు ధన్యవాదాలు.

– మహబూబ్‌బాషా, బుక్కపట్నం

డిగ్రీ కళాశాలల్లో త్వరలో తనిఖీలు

- జీరో అడ్మిషన్లు, కండీషన్ అఫిలియేషన్ కళాశాలల్లో సమగ్ర పర్యవేక్షణ
- గతేడాది గుర్తించిన లోపాలను సరిదిద్దుకున్నారా? అనే అంశంపై విచారణ



అనంతపురం: ఎస్కేయూనివర్సిటీ అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనాభ్యాసన నాణ్యతా ప్రమాణాలు, అర్హత, అనుభవం గల ఫ్యాకల్టీ ఉందా? లేదా అనే అంశంపై ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ త్వరలో తనిఖీలు నిర్వహించనున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో జీరో అడ్మిషన్లు గల కళాశాలలు, కండిషన్ అఫిలియేషన్ జారీ చేసిన కళాశాలలు లోపాలు సరిదిద్దుకుంటామని హైకోర్టుకు విన్నవించాయి. ఈ నేపథ్యంలో కొన్ని డిగ్రీ కళాశాలలకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. ఇందులో లోపాలు సరిదిద్దారా? లేదా? లోపాలు ఉన్నా 2023–24 విద్యా సంవత్సరానికి అనుమతి మంజూరు చేశారా? అనే అంశంపై నిర్ధారించడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఉద్దేశపూర్వకంగా అనుమతి మంజూరు చేసి ఉంటే సంబంధిత యూనివర్సిటీ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని జీఓలో స్పష్టం చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ డిగ్రీ కళాశాలలు 83 ఉన్నాయి. ఇందులో 7 డిగ్రీ కళాశాలల్లో జీరో అడ్మిషన్లు ఉన్నాయి. 13 డిగ్రీ కళాశాలలకు రెగ్యులర్ అఫిలియేషన్ కల్పించారు. తక్కిన 63 డిగ్రీ కళాశాలల్లో కండిషన్ అఫిలియేషన్ కల్పిస్తూ ఆయా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సంబంధిత 70 డిగ్రీ కళాశాలల్లోనూ ర్యాండమ్‌గా ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యవేక్షణ చేయనున్నారు. కళాశాలలు అప్‌లోడ్ చేసిన సమాచారం తప్పుగా ఉన్నట్లు నిర్ధారణ అయినా, సంబంధిత వర్సిటీ అధికారులు సమ్మతి నివేదికలు అనుకూలంగా ఇచ్చినా విజిలెన్స్ విచారణ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రశాంతి నిలయంలో నేడు గురుపౌర్ణమి



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరగనున్నాయి. ఇప్పటికే సత్యసాయి మహాసమాధి, సాయి కుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయికి గురువందనం సమర్పించేందుకు వేలాది సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. భక్తులతో సందడి నెలకొంది. ఉదయం 8 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. 8.20కి ప్రశాంతి భజన బృందం గురువందనం అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద, గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య ప్రసంగిస్తారు. 9.20కి సత్యసాయి దివ్య ఉపన్యాసం డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు. 9.40కి మహా మంగళహారతితో వేడుకలు ముగుస్తాయి. సాయంత్రం 5 గంటలకు మళ్లీ ప్రారంభమయ్యే వేడుకల్లో డాక్టర్ కార్తీక్ బృందం సంగీత కచేరి, సత్యసాయి భక్తులు భజనలు ఉంటాయి.

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. డివిజన్, మండల స్థాయిలో సైతం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు పొందుపరచాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేయవచ్చు.

పుట్టపర్తికి మరో మకుటం



- సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం రేపు
- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ప్రశాంతి నిలయం: అనేక పెద్ద భవనాలతో ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన పుట్టపర్తిలో.. అత్యాధునిక హంగులతో మరో భవనం మకుటాయమానంగా రూపుదిద్దుకుంది. ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్మించిన సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవం మంగళవారం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణకు వీలుగా సుమారు రూ.15 కోట్లతో భవనాన్ని నిర్మించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ కార్యకలాపాలను ఒకే సారి 1,300 మంది ఆసీనులై వీక్షించవచ్చు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన భవనాన్ని మంగళవారం ప్రధాని ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవంలో గవర్నర్ నజీర్ పాల్గొంటారు.

బీమా.. అన్నదాత ధీమా

- 8న ఖాతాల్లోకి పంటల బీమా నగదు
- ఆర్‌బీకేల్లో జాబితా ప్రదర్శన
- ముదిగుబ్బకు అత్యధికంగా రూ.17.15 కోట్లు మంజూరు



బీమా వివరాలు చూసుకుంటున్న చెర్లోపల్లి రైతులు

పుట్టపర్తి అర్బన్: రైతులను ఆదుకోవడంలో ప్రతి విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటున్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన పంటలకు సంబంధించి జిల్లా రైతాంగానికి రూ.157.359 కోట్లు మంజూరు చేశారు. రైతు బాంధవునిగా ఖ్యాతికెక్కిన తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఈ నెల 8న నిర్వహించే సభలో బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట నష్టపోయిన కొద్దిరోజుల్లోనే పరిహారం అందజేస్తుండడం గమనార్హం.

ముదిగుబ్బ మండలానికి అత్యధికం..
ముదిగుబ్బ మండలానికి అత్యధికంగా రూ.17.15 కోట్ల పంటల బీమా మంజూరైంది. ఈ మండలంలో రైతులు సాగు చేసిన కంది పంటకు రూ.12.54 కోట్లు, చీనీ-రూ.4.58 కోట్లు, మొక్కజొన్న- రూ.3.58 లక్షలు మంజూరైంది. ఆ తరువాత గోరంట్ల మండలానికి అత్యధికంగా రూ.14.72 కోట్ల బీమా మంజూరైంది. ఇక.. ధర్మవరం మండలానికి రూ.12.39 కోట్లు, నల్లమాడ మండలానికి రూ.11.20 కోట్లు, తాడిమర్రి- రూ.11.10 కోట్లు, తలుపుల- రూ.9.19 కోట్లు, తనకల్లు-రూ. 7.38 కోట్లు, గాండ్లపెంట-రూ.6.5 కోట్లు, కదిరి-రూ. 6.26 కోట్లు, లేపాక్షి-రూ.5.96 కోట్లు, కనగానపల్లి-రూ.5.47 కోట్లు, అమరాపురం-5.37 కోట్లు, రామగిరి-రూ.5.18 కోట్లు, రొద్దం-రూ.3.53 కోట్లు, గుడిబండ-రూ.3.14 కోట్లు, రొళ్ల-రూ.2.79 కోట్లు, మడకశిర-రూ.2.39 కోట్లు, ఎన్‌పీకుంట-రూ.1.78 కోట్లు, సోమందేపల్లి-రూ.1.67 కోట్లు, పెనుకొండ-రూ.1.57 కోట్లు, అమడగూరు-రూ.1.25 కోట్లు, కొత్తచెరువు-రూ.1.40 కోట్లు, పుట్టపర్తి-రూ.1.15 కోట్లు, బుక్కపట్నం-రూ.1.06 కోట్లు, ఓడీసీ-రూ.74.16 లక్షలు, అగళి - 73.96 లక్షలు, చిలమత్తూరు-37.96 లక్షలు, నల్లచెరువు-రూ.57.54 లక్షలు, హిందూపురం-రూ.7.83 లక్షలు, రొద్దం-రూ.3.53 లక్షలు, పరిగి మండలానికి రూ.1.01 లక్షలు మంజూరైంది. లబ్ధిదారుల జాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్నారు.

వాతావరణ బీమా..
గత సంవత్సరం వర్షాలు బాగా కురవడంతో వాతావరణ బీమా వస్తుందని ఎవరూ ఊహించలేదు. అయినా, ప్రభుత్వం రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా ప్రకటించడం విశేషం. జిల్లాలో పలు పంటల రైతులకు బీమా మంజూరైంది. టమాటకు సంబంధించి 8,349 మంది రైతులకు రూ.59.72 లక్షలు మంజూరు చేశారు. అలాగే, చీనీ పంట సాగు చేసిన 9,387 మంది రైతులకు రూ.34.88 కోట్లు, వేరుశనగకు సంబంధించి 88,633 మంది రైతులకు రూ.52.69 కోట్లు మంజూరైంది. పంట దిగుబడి ఆధారంగా మొక్కజొన్నకు రూ.15.08 కోట్లు, కంది పంటకు రూ.50.39 కోట్లు, రాగికి రూ.3.69 కోట్లు కలిపి మొత్తం రూ.157.359 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

రూ. 80 వేలు మంజూరైంది



9 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. సుమారు రూ.80 వేలకు పైగా పరిహారం వస్తుందని అధికారులు చెప్పారు. పంట నష్టపోయిన అతి కొద్ది రోజుల్లేనే పరిహారాన్ని విడుదల చేయడం గతంలో ఎప్పుడూ చూడలేదు. వైఎస్ జగన్ లాంటి ముఖ్యమంత్రి ఉంటే రైతు కచ్చితంగా రాజవుతాడు.

– లక్ష్మీనరసింహారెడ్డి, చిన్నకోట్ల, ముదిగుబ్బ మండలం

చాలా సంతోషంగా ఉంది



ఎకరా పొలంలో మొక్కజొన్న సాగు చేశా. పంట కొంత మేర ఎండిపోయింది. వెంటనే రైతు భరోసా కేంద్రానికి వెళ్లి విషయం చెప్పా. ఫోటోలు తీసి పంపారు. రూ.5 వేల పరిహారం మంజూరైంది. చాలా సంతోషంగా ఉంది.

– ప్రసాద్, రైతు, పెదపల్లి

గతంలో ఇలా లేదు...



ఈనెల 8న సీఎం వైఎస్ జగన్ కళ్యాణదుర్గం వస్తున్నారు. ఆ రోజు రైతు దినోత్సవాన్ని జరుపుకోవడంతో పాటు బీమా పరిహారాన్ని బటన్ నొక్కి జమ చేయనున్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇంత త్వరగా పరిహారం అందజేయడం ఈ ప్రభుత్వంలో మాత్రమే జరుగుతోంది.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి



ప్రత్యేక అలంకరణలో మడకశిరలోని బాబా విగ్రహం

సాయీ శరణం.. బాబా శరణం

జిల్లావ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. షిర్డీ సాయినాథుడు విశేష పూజలు అందుకోనున్నారు. పర్వదినాన్ని వైభవంగా చేసుకునేందుకు స్వామివారి మందిరాలను విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. ప్రసిద్ధిగాంచిన మడకశిర పట్టణంలోని ఆలయంలో ఇప్పటికే వేడుకలు ప్రారంభమయ్యాయి.

– పుట్టపర్తి అర్బన్:

క్లుప్తంగా

నేడు బుక్కపట్నంలో 'అమ్మఒడి' కార్యక్రమం

పుట్టపర్తి: జిల్లా స్థాయి అమ్మఒడి, ఆణిముత్యాలు కార్యక్రమాలను సోమవారం బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు విజయమ్మ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో విజయమ్మ (38) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విజయమ్మ తన భర్త అశ్వర్థనారాయణతో కలిసి గ్రామంలో నివసిస్తోంది. అయితే కొంత కాలంగా విజయమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన బంధువులు విజయమ్మను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే విజయమ్మ అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడుకు చెందిన పక్కీరప్ప (52) పాముకాటు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకెళితే... నాలుగు రోజుల క్రితం పక్కీరప్ప కట్టెలు కొట్టడానికి కూలి పనికి వెళ్లారు. ఈ సమయంలో పాము కాటు వేసింది. పక్కీరప్ప గమనించకుండా పని పూర్తి చేసుకొని ఇంటికి వచ్చారు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురికావడం కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం గుత్తికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని కాటేసిన విషపురుగు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకులంలో సాయి సేవా నాయక్ అనే విద్యార్థిని ఆదివారం విషపురుగు కాటేసింది. వివరాల్లోకెళితే.. సేవాగఢ్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి ఆదివారం సెలవు కావడంతో హాస్టల్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అయితే తన ఎడమ వైపున నడుము వద్ద ఏదో కుట్టికట్టు గుర్తించి వార్డెన్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు

వినూత్న పంట.. లాభాలేనంట

ఏటా సంప్రదాయ పంటల సాగుతో విసిగిపోతున్న రైతులు కొత్త పంటల వైపు దృష్టి మళ్లిస్తున్నారు. చక్కటి ప్రణాళికతో ముందుకెళ్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఆ కోవలోకే వస్తారు.. గోరంట్ల మండల పరిధిలోని మల్లాపల్లికి చెందిన రైతు బాలకృష్ణ. డ్రాగన్ ఫ్రూట్ సాగుతో మంచి ఆదాయం గడిస్తున్నారాయన.
– గోరంట్ల:




బాలకృష్ణకు చెందిన డ్రాగన్ ఫ్రూట్ తోట

- డ్రాగన్ ఫ్రూట్ పంటతో ఆదాయం పొందుతున్న రైతు
- కుమారుడి ప్రోత్సాహంతో సాగు
- మొదటి పంటతోనే పెట్టుబడి వెనక్కి

తన రెండెకరాల్లో 16 నెలల క్రితం 800 డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను బాలకృష్ణ నాటారు. బెంగళూరులో ఉన్న కుమారుడు పంట సాగు గురించి చెప్పి అక్కడి నుంచే మొక్కలు మల్లాపల్లికి పంపారు. మొక్కలు అల్లుకోవడానికి పొలంలో గుంతలు తవ్వి సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయించారు. డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్నారు. ఎకరానికి దాదాపు రూ. 4 లక్షల చొప్పున రెండు ఎకరాలకు రూ. 8 లక్షలు ఖర్చయింది. ఇటీవల 8 టన్నుల దిగుబడి వచ్చింది. హిందూపురం, కదిరి, పెనుకొండ తదితర పట్టణాల్లోని మార్కెట్లతో పాటు తోట వద్ద డ్రాగన్ ఫ్రూట్స్ విక్రయిస్తున్నాడు. ఇప్పటికే పెట్టుబడికి అయిన ఖర్చంతా రైతు చేతికి అందింది. ప్రస్తుతం తోట వద్ద పండ్లు విక్రయిస్తున్నాడు. కిలో రూ. 100 నుంచి రూ. రెండు వందల వరకూ రేటు దక్కుతోంది. ఆ డబ్బంతా లాభమే. ఇకపై 9 నెలల కోసారి పంట దిగుబడి రానుంది. ఆ ఉత్పత్తుల అమ్మకం ద్వారా అందే మొత్తమూ ఆదాయమే.

కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే..

డ్రాగన్ ఫ్రూట్‌లో ఔషధ గుణాలు కలిగి ఉండటంతో తోట వద్దకే వచ్చి కిలో రెండు వందలకు చొప్పున కొంటున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసిన 16 మాసాల్లో రైతు చేతికి అందుతుంది. ఆ తర్వాత 9 నెలలకొకసారి చొప్పున 25 సంవత్సరాలు పంట ఉత్పత్తులు తీసుకోవచ్చు. మూడు నెలల పాటు నిరంతరాయంగా ఫ్రూట్స్ తోట నుంచి వస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పండుకు ఎలాంటి రోగాలు రాకపోయినా, చిగురుకు మాత్రం చీమలు పడుతుంటాయి. వీటి నివారణకు వేప నూనె ఏడాదిలో ఒక్కసారి స్ప్రే చేస్తే సరిపోతుంది.

మంచి లాభాలు పొందొచ్చు..



డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొదటి సంవత్సరంలో మాత్రమే అధిక పెట్టుబడి వస్తుంది. ఎరువులు, వ్యవసాయ పనుల కోసం రూ. 50 వేల వరకూ అవుతుంది. తరువాత ఎలాంటి ఖర్చులు రావు. రైతులు డ్రాగన్ ఫ్రూట్ చేసుకొంటే మంచి లాభాలను ఆర్జించవచ్చు. ప్రభుత్వం పంటకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత లాభం పొందవచ్చు. ఈ ఏడాది నుంచి రైతులకు కావాల్సిన డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు కూడా అమ్ముతా. అందుకోసం నర్సరీ ఏర్పాటు చేస్తా.
– బాలకృష్ణ, రైతు, మల్లాపల్లి

ప్రోత్సాహం అందిస్తాం..

డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయి. రైతులు కమర్షియల్ పండ్ల తోటల పెంపకానికి ముందుకొస్తే ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అన్ని విధాల తోడ్పాటు అందిస్తుంది. పంట సాగుకు ఆసక్తి గల రైతులు మమ్మల్ని సంప్రదించాలి.
– సుదర్శన్, ఉద్యాన శాఖ అధికారి

యువతలో స్వీయ పరివర్తనే లక్ష్యం


సంగీత కచేరి నిర్వహిస్తున్న గ్లోబల్ కౌన్సిల్ యువతీయువకులు



యువకుడికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రశాంతి నిలయం: యువతలో స్వీయపరివర్తన తీసుకురావడమే సత్యసాయి గ్లోబల్ ట్రస్ట్ యంగ్ అడల్ట్స్ లీడర్ షిప్ ప్రోగ్రాం లక్ష్యమని సత్యసాయి గ్లోబర్ కౌన్సిల్ కన్వీనర్ శివేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత యంగ్ అడల్ట్స్ లీడర్ షిప్ ప్రోగ్రాం మొదటి స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కోర్సు పూర్తి చేసిన 74 మందికి పట్టాలను పంపిణీ అందజేశారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన యువతీ, యువకులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సత్యసాయి మిషన్‌ను విస్తరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, నిమిష్ పాండ్య విద్యార్థులకు పట్టాలు అందించారు. తర్వాత గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన యువతీ, యువకులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు నాగానంద, డాక్టర్ మోహన్, హీరా తదితరులు పాల్గొన్నారు.

రికార్డు భాగస్వామ్యం


షోయబ్


గిరినాథరెడ్డి

అనంతపురం: మల్టీడే సీనియర్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా అనంతపురం, కడప జిల్లా జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో రికార్డు నమోదైంది. స్థానిక ఆర్డీటీ ప్రధాన మైదానంలో ఆదివారం రెండోరోజు మొదటి ఇన్నింగ్స్‌లో పి. గిరినాథరెడ్డి , షోయబ్ 374 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో అనంతపురం జట్టు 570 పరుగులు సాధించి 9 వికెట్లు కోల్పోయింది. పి. గిరినాథరెడ్డి 202 పరుగులు , (279 బంతులు, 18 ఫోర్లు, 8 సిక్సర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. షోయబ్ మహమ్మద్‌ఖాన్ 199 పరుగులు (208 బంతుల్లో 23 ఫోర్లు, 4 సిక్సర్లు) చేశారు. అనంతపురం జట్టు ప్రస్తుతం 361 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణీ ప్రసవం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం పాలవాయి- భట్టువాని పల్లి గ్రామాల మధ్యలో ఓ ప్రైవేట్ వాహనంలో నిండు గర్భిణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకెళితే.. కళ్యాణదుర్గం మండలం మాక్తికాపురం (ములకన్న కొట్టాల)కు చెందిన తస్లీమ్ అనే మహిళకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. 108 కు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అయితే అప్పటికే రాయదుర్గం నియోజకవర్గంలో ఓ కేసు పై వెళ్లిన 108 వాహనం తిరిగి వచ్చేందుకు ఆలస్యం అవుతుందని 108 సిబ్బంది సమాధానం ఇచ్చారు. అంతటి వరకు వేచి ఉండక తస్లీమ్ కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ వాహనాన్ని బాడుగకు తీసుకుని కళ్యాణ దుర్గంకు బయలుదేరారు. భట్టువానిపల్లి-పాలవాయి మధ్యకు రాగానే తస్లీమ్‌కు నొప్పులు అధికం కావడంతో రోడ్డు పక్కన వాహనాన్ని ఆపారు. తస్లీమ్ మగ బిడ్డకు జన్మనిచ్చింది.

ఉదారతను చాటుకున్న ఉపాధ్యాయుడు..

వెంకటంపల్లి తండా నుండి కళ్యాణదుర్గం వైపు వస్తున్న ఉపాధ్యాయుడు బద్దేనాయక్ తన వాహనాన్ని ఆపి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ఫోన్లో వైద్య సిబ్బందితో మాట్లాడారు. బిడ్డకు పుట్టిన వెంటనే ఇంజెక్షన్లు వేయాలని సూచించడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తన వాహనంలో తల్లీబిడ్డను ఎక్కించుకుని కళ్యాణ దుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బద్దే నాయక్‌కు తస్లీమ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు బద్దేనాయక్‌ను అభినందించారు.


ప్రసవం అనంతరం బిడ్డను చూస్తున్న కుటుంబ సభ్యులు

బీజేపీ నాయకుడిపై కేసు

కదిరి టౌన్: చిరు వ్యాపారిని బెదిరించిన ఘటన బీజేపీ నాయకుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు నాగేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నాగేష్ పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే తమకు రూ.లక్ష ఇస్తే సరే.. లేకపోతే అంబేడ్కర్ సర్కిల్‌లో బండి పెట్టనీయమని బీజేపీ నాయకుడు గంగాధర్‌తో పాటు రాము, పవన్, ఉపేంద్ర బెదిరించారు. ఈ నేపథ్యంలో నాగేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మధు తెలిపారు.

టీడీపీ భవిష్యత్‌కు 'గ్యారంటీ' ఏదీ?

- బస్సుయాత్రకు ప్రజాస్పందన కరువు
- దిక్కుతోచని స్థితిలో తమ్ముళ్లు
- గార్లదిన్నెలో కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్ డుమ్మా !


ఇల్లూరులో జనం లేక వెలవెలబోతున్న బస్సుయాత్ర

గార్లదిన్నె: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'భవిష్యత్‌కు గ్యారంటీ' అట్టర్ ఫ్లాప్‌గా మారింది. ఆ పార్టీ నాయకులతో పాటు జనం నుంచి కూడా స్పందన లేకపోవడంతో టీడీపీ భవిష్యత్‌కే గ్యారెంటీ లేదని ప్రజలు అంటున్నారు. గార్లదిన్నె మండల పరిధిలోని ఇల్లూరులో ఆదివారం టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్‌కు గ్యారెంటీ బస్సుయాత్రకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణితో పాటు ఆమె వర్గం నాయకులు, కార్యకర్తలు హాజరు కాలేదు. దీంతో టీడీపీకి భవిష్యత్తు ఏది అని బహిరంగంగానే ప్రజలు గుసగుసలాడుకున్నారు.

చికెన్, మందు ఏర్పాటు చేసినా...

షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలకు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరగాల్సి ఉంది. అయితే జనం రాకపోవడంతో ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమైంది. టీడీపీ నాయకులు బస్సుయాత్రకు వాహనాలు సమకూర్చిన జనం రాకపోవడంతో బస్సుయాత్ర కాస్తా తుస్సు యాత్రగా మారింది. టీడీపీ నాయకులు నామమాత్రంగానే కార్యక్రమాన్ని జరిపించి మమ అనిపించారు. కార్యక్రమానికి వచ్చిన వాళ్లకు చికెన్, మందు ఏర్పాటు చేసినా పెద్దగా స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నాయకులకు దిక్కుతోచని పరిస్థితి.

ఆధిపత్య పోరుతోనే..

టీడీపీలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు మరోసారి బయట పడింది. శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేసినప్పటికీ టీడీపీలో అగ్రవర్ణ కులాల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి గైర్హాజరైనట్లు సమాచారం. బస్సు యాత్రకు స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఎక్కడా శ్రావణి ఫొటో లేకపోవడం గమనార్హం. అలాగే కల్లూరు వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో కూడా జనం లేక వెలవెలబోయింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డీ.లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... పెద్దకోట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ కార్యకర్త గోగుల బాబు, బత్తిన తిరుపాల్ తాడిమర్రిలోని టీడీపీ నాయకుడు ముంటిమడుగు ప్రసాద్ రైస్‌మిల్లు వద్ద శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మాట్లాడుతూ ఉన్నారు. ఆ సమయంలో టీడీపీ నాయకుడు ముంటిమడుగు హర్షవర్ధన్ ఇక్కడెందుకు ఉన్నారని వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువురు గొడవపడగా హర్షవర్ధన్ అతని అనుచరులు భాస్కర్‌గౌడ్, రవి, ఆనంద్, నాగేంద్ర, ఓబిలేసు తదితరులు బాబుపై కొడవలి, రాడ్‌లతో దాడి చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో బేల్దారి మృతి

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన ఆర్. రంగానాయక్ (40) అనే బేల్దారి అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు ... నల్లమాడ మండలం పెమనకుంటపల్లి తండాకు చెందిన రంగానాయక్ రెండేళ్ల క్రితం ముదిగుబ్బకు వలస వచ్చారు. ముదిగుబ్బలో బేల్దారి పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. మూడు రోజులు కనిపించడం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కదిరి రోడ్డులోని పీవీఎస్ స్కూల్ వెనుక భాగాన ఉన్న గుట్టలో మృతదేహం ఉన్నట్లు ఆదివారం గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి సీఐ కంబగిరిరాముడు, ఎస్‌ఐ హేమంత్‌కుమార్ పరిశీలించారు. శవం కుళ్లిపోవడంతో అక్కడే పడి ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా బేల్దారి రంగానాయక్‌గా గుర్తించారు. అనుమానాస్పదస్థితిలో చనిపోయినట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, మొదటి భార్యకు ఇద్దరు కుమారులు, రెండో భార్యకు ఒక కుమారుడు ఉన్నాడన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- అక్కాతమ్ముళ్లకు గాయాలు


చెట్టును ఢీకొన్న కారు

ములకలచెరువు: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో అక్కాతమ్ముళ్లకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా పెద్ద తిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన బావాజాన్ తన అక్క హసీనా, పిల్లలను శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువులోని అత్తగారింటిలో వదిలివచ్చేందుకు కారులో బయలుదేరారు. అయితే ములకలచెరువు మండలం కదిరి రోడ్డు సరిహద్దులో అదుపుతప్పి చింతచెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బావాజాన్ (33), హసీనా (38)లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ములకలచెరువు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విడపనకల్లు రిపోర్టర్‌పై దాడి

ఉరవకొండ: విడపనకల్లు మండలం 'సాక్షి' దినపత్రిక రిపోర్టర్ సుంకన్నపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ఆదివారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కవర్ చేయడానికి రిపోర్టర్ సుంకన్న అక్కడికి వెళ్లారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న అదే గ్రామానికి చెందిన కరెంట్ తిమ్మప్ప కుమారుడు రాజు రిపోర్టర్ సుంకన్నపై దాడి చేశాడు. రెండేళ్ల క్రితం దినపత్రికలో వచ్చిన వార్త గురించి ప్రస్తావిస్తూ వాదనకు దిగాడు. కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా కొట్టాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ రిపోర్టర్ సుంకన్నను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఇదిలా ఉంటే ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ అరగంటలోపే నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గాయపడ్డ రిపోర్టర్ సుంకన్నను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు.

కుమార్తెను వేధిస్తున్న తండ్రిపై కేసు


మడకశిరరూరల్: మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామంలో కుమార్తెను వేధిస్తున్న ఓ తండ్రిపై ఆదివారం కేసు నమోదు చేశామని సీఐ సురేష్ బాబు తెలిపారు. 10వ తరగతి పాసై ఇంట్లో ఉంటున్న కూతురిని కొన్ని నెలల నుంచి తండ్రి వేధిస్తున్నాడని చెప్పారు. శనివారం రాత్రి బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై విచారణ చేసి పూర్తి వివరాలను వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా .. దంపతుల దుర్మరణం

బొమ్మనహాళ్: మండల పరిధిలోని నక్కలపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తా పడటంతో పొలం పనులకు వెళ్తున్న రైతు దంపతులు ఈశ్వర్‌రెడ్డి (46), సువర్ణమ్మ (38) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. నక్కలపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ దంపతులు ఆదివారం ట్రాక్టర్‌కు గుంటకను అమర్చుకొని పొలం పనులకు బయలు దేరారు. గ్రామ సమీపంలో ఎర్ర వంక పక్కనే ఉన్న రహదారిపై ట్రాక్టర్ అదుపుతప్పి వంకలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులకు కుమారుడు పునీత్‌రెడ్డి, కుమార్తె సుమనశ్రీ ఉన్నారు. వారు 6, 8 తరగతి చదువుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారి మృతితో నక్కలపల్లిలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుని తల్లి తిప్పమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వ సంతాపం..

రైతు దంపతుల మృతి విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి చేరుకొని ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ మృతదేహాల వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీసీసెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న తదితరులున్నారు. ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి కూడా బాధిత కుటుంబానికి ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.




ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ (ఫైల్)


రైతు దంపతుల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు